సాక్షి
అనంతపురం
ఆదివారం । 29 । జూన్ । 2025



చీనీ టన్ను రూ.27,690

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.27,690 పలికాయి.



పెరిగిన ఇన్‌ఫ్లో

తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగింది. శనివారం సాయంత్రానికి 60 వేల క్యూసెక్కులు నమోదైంది.

గరిష్ఠం/కనిష్ఠం
35.8°/23.6°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై జేసీ కక్ష సాధింపు

- అధికారులను ఉసిగొల్పి ఇంటికి కొలతలు



కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి వద్ద కొలతలు వేస్తున్న మున్సిపల్ అధికారులు

తాడిపత్రి టౌన్: ఆక్రమణల పేరుతో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్‌రెడ్డి, ఫయాజ్‌బాషాపై అధికారులను ఉసిగొల్పి వేధింపులకు పాల్పడిన ఆయన.. శనివారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిపైకి మున్సిపల్ అధికారులను ఉసిగొల్పారు. తాడిపత్రి పట్టణంలోని కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటికి కొలతలు వేయించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్దారెడ్డి ఇంటి పరిసరాలు, లోపల టౌన్ ప్లానింగ్ అధికారి సుజాత కొలతలు వేసి రికార్డు చేశారు.

భారీ బందోబస్తు..

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి వద్ద మున్సిపల్ అధికారులు కొలతలు వేస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి, సీఐ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు చేపట్టారు.కేతిరెడ్డి ఇంటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. పట్టణ ప్రధాన కూడళ్లలో సిబ్బందిని మోహరించారు.

విధ్వంస పాలన..

జేసీ ప్రభాకర్‌రెడ్డి విధ్వంస పాలనకు తెరలేపాడని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజమెత్తారు. పట్టణ అభివృద్ధి గురించి మరిచి రోడ్లు కొడతా..సమాధులు కొడతా.. వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లు కొడతా అంటూ రోజూ అలజడి సృష్టిస్తున్నాడని దుయ్యబట్టారు. మొన్నటి వరకు తమ పార్టీ నాయకుల ఇళ్లను ధ్వంసం చేసి నేడు నా ఇంటికి కూడా కొలతలు వేయించారని విమర్శించారు. తాను చట్టానికి లోబడే ఉంటానని స్పష్టం చేశారు.

సచివాలయాల్లోనే సబ్ డివిజన్‌కు రుసుం స్వీకరణ

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం అర్బన్: ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ కింద దరఖాస్తు రుసుమును సచివాలయాల్లోనే సిబ్బంది స్వీకరించారు. దరఖాస్తు రుసుం స్వీకరించని అంశంపై 'సాక్షి'లో 'అమలుకాని ఆదేశాలు' శీర్షికన శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సబ్‌డివిజన్ కోసం వచ్చే రైతుల నుంచి దరఖాస్తు రుసుం స్వీకరించాలని సిబ్బందిని సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్ ఆదేశించారు. జేసీ ఆదేశాలను అమలు చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ క్రమంలోనే రైతు కిష్టకు కొర్రపాడు-2 (బోడిగాని దొడ్డి) సచివాలయ సిబ్బంది ఫోన్ చేసి సబ్‌డివిజన్‌కు రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

వీఆర్‌ఓలు, సర్వేయర్లకు నేడు బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం అర్బన్: సచివాలయాల్లో పని చేస్తున్న గ్రేడ్-2 వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్ల బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియను ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా సచివాలయాల్లో 328 మంది గ్రేడ్-2 వీఆర్‌ఓలు ఉండగా ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు 121 మంది ఉన్నారు. మొత్తం 130 ఖాళీలను చూపించారు. ఇక గ్రామ సర్వేయర్ల బదిలీలు ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో జరగనున్నాయి.

కౌన్సెలింగ్ రసాభాస



కౌన్సెలింగ్‌కు హాజరైన దివ్యాంగుడు



అధికారుల తీరుపై నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

- గందరగోళంగా సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ
- లోపభూయిష్ట విధానాలపై ఉద్యోగుల ఆగ్రహం
- ప్రజాప్రతినిధుల సిఫార్సులకు పెద్దపీట వేయడంపై నిలదీత

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ రసాభాసగా సాగింది. అధికారుల లోపభూయిష్ట విధానాలపై ఉద్యోగులు కన్నెర్ర జేశారు. శనివారం అనంతపురం జిల్లా పరిషత్ క్యాంపస్‌లోని డీపీఆర్‌సీ భవన్, సాయినగర్‌లోని బీఆర్ అంబేడ్కర్ భవన్, తపోవనంలోని పుష్ప కన్వెన్షన్ హాల్, హౌసింగ్ బోర్డులో జయమణెమ్మ కల్యాణ మండపం వేదికగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించడంతో ఉద్యోగులతో ఆయా ప్రదేశాలు కిక్కిరిసిపోయాయి.

కేంద్రాల్లో ఆందోళన

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రక్రియ నిర్వహించడంపై ఉద్యోగులు కౌన్సెలింగ్‌ను అడ్డుకున్నారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు కొందరు తమ నియోజకవర్గాల్లోని స్థానాలను బ్లాక్ చేయించినట్లు తెలుసుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీలు చూపకుండా.. మొక్కుబడిగా కౌన్సెలింగ్‌ను నిర్వహించడాన్ని నిరసిస్తూ కౌన్సెలింగ్ కేంద్రాల్లోనే ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కౌన్సెలింగ్ ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగింది. అభ్యర్థుల ఆందోళనల మధ్య కాసేపు కౌన్సెలింగ్ నిర్వహించడం, ఆ తరువాత వాయిదా పడటం.. ఇలా ఆగుతూ.. సాగుతూ ముందుకు నడిపించారు.

మితిమీరిన జోక్యం..

టీడీపీ ఎమ్మెల్యేల మితిమీరిన జోక్యంతో కౌన్సెలింగ్ ప్రక్రియ గందరగోళానికి దారి తీసింది. తమ నియోజకవర్గాల్లోని ఖాళీలను బ్లాక్ చేయాల్సిందిగా కొందరు ఎమ్మెల్యేలు అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారని సచివాలయ ఉద్యోగులు ఆరోపించారు. దీంతో ఆయా స్థానాలను అధికారులు ఖాళీ చూపకుండా దూర ప్రాంతాల్లోని స్థానాలను మాత్రమే చూపించారని వాపోయారు. ఈ విషయంపై సచివాలయ ఉద్యోగులు, యూనియన్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక అధికారులు నీళ్లు నమిలారు. డీపీఆర్‌సీ భవన్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియ సందర్భంగా డీపీఓ, కొందరు సిబ్బంది పదేపదే బయటకు వెళ్లి రావడం, కొందరితో రహస్యంగా మంతనాలు సాగించడం చూసిన అభ్యర్థులు ఆందోళనకు దిగారు.

సౌకర్యాల్లేక ఇబ్బందులు

డీపీఆర్‌సీ భవన్, అంబేడ్కర్ భవన్‌లో అధికారులు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేకపోయారు. ముఖ్యంగా డీపీఆర్‌సీలో పై అంతస్తులో కౌన్సెలింగ్ నిర్వహించడంతో దివ్యాంగులు నరక యాతన అనుభవించారు. చంటి బిడ్డల తల్లుల వేదన వర్ణనాతీతంగా మారింది.

ముగిసిన కౌన్సెలింగ్

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నగర పాలక సంస్థతో పాటు జిల్లాలోని 11 మునిసిపాలిటీల్లోని సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ శనివారం ముగిసింది. అర్ధరాత్రి వరకు ప్రక్రియ చేపట్టారు. నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పర్యవేక్షణలో జీసస్ నగర్‌లోని జయమణెమ్మ కల్యాణమంటపంలో ఎడ్యుకేషన్, వెల్ఫేర్, పుష్ప కన్వెన్షన్ హాలులో శానిటేషన్, అమినిటీస్, నగరపాలక సంస్థలో ప్లానింగ్ కార్యదర్శులకు కౌన్సెలింగ్ జరిగింది.

'స్పౌజ్'పై గందరగోళం..

నిబంధనలకు వ్యతిరేకంగా స్పౌజ్ చూపుతూ అక్రమాలకు పాల్పడుతుండటంపై కొంత మంది వెల్ఫేర్ కార్యదర్శులు అభ్యంతరాలు లేవనెత్తడంతో గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించారు. వివిధ మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థలో మొత్తం అమినిటీ సెక్రటరీలు 78, వార్డు ఎడ్యుకేషన్ 231, ప్లానింగ్ 85, శానిటేషన్ 184, వెల్ఫేర్ 232, అడ్మిన్ సెక్రటరీలు 143 మందికి ఐదేళ్లు పూర్తి అవడంతో వారు వేకెన్సీలో వచ్చారు. ర్యాంకు, స్పౌజ్, దివ్యాంగులు తదితరాల ఆధారంగా కోరుకున్న స్థానాలకు బదిలీ చేశారు. ఈ నెల 30న ఉద్యోగులకు మునిసిపల్ ఆర్‌డీ విశ్వనాథ్ ప్రొసీడింగ్స్ ఇవ్వనున్నారు.

నాంధేడ్-తిరుపతి మధ్య ప్రత్యేక రెళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని నాంధేడ్-తిరుపతి మధ్య జూలై 5 నుంచి 27 వరకు ప్రత్యేక రెళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. నాంధేడ్ జంక్షన్‌లో రైలు (07015) జూలై 5 శనివారం సాయంత్రం 4.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఆదివారం ఉదయం 10.10 గంటలకు తిరుపతి చేరుతుందన్నారు. ఈ రైలు జూలై 5వ తేదీ నుంచి 26వ తేదీ (4 సర్వీసులు) వరకు శనివారాలు మాత్రమే తిరుగుతుందన్నారు. అదేవిధంగా తిరుపతి జంక్షన్ నుంచి (07016) ఆదివారం సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సోమవారం మధ్యాహ్నం 1.15 గంటలకు నాంధేడ్ చేరుకుంటుందని వెల్లడించారు. జూలై 6 నుంచి 27వ తేదీ వరకు ఆదివారాల్లో మాత్రమే ఈ రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు. ముద్దడ్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి, కాచిగూడ,ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల,మహబూబ్‌నగర్, వనపర్తి,గద్వాల, కర్నూలు, డోన్,గుత్తి,తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట మీదుగా రాకపోకలు సాగిస్తుందన్నారు. ఫస్ట్ క్లాస్ ఏసీ, 2 టైర్ ఏసీ, 3టైర్ ఏసీతోపాటు స్లీపర్, జనరల్ బోగీలు ఉంటాయన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే అడ్డు!

- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ పేర్లు ఉండటంతో కక్ష సాధింపు
- రాప్తాడులో ఆగిపోయిన విగ్రహ ప్రతిష్టాపనోత్సవం



విగ్రహం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న భీమ్ రావ్ యువజన సంఘం నాయకులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాప్తాడులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరగకుండా ఎమ్మెల్యే అడ్డుపడడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పాంప్లేట్‌లో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ప్రొఫెసర్ సాకే రాజేష్ కుమార్ పేర్లు ముద్రించడాన్ని సహించలేక కక్షసాధింపులకు దిగినట్లు తెలిసింది. ఎమ్మెల్యే ఆదేశాలతో నిర్వాహకులకు అధికారులు నోటీసులిచ్చి కార్యక్రమాన్ని నిలిపివేయించారు. వివరాలు.. రాప్తాడులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని భీమ్ రావ్ యువజన సంఘం నాయకులు 2021 ఏప్రిల్‌లో తీర్మానం చేశారు. ఎంపీడీఓ కార్యాలయం ముందు విగ్రహ ఏర్పాటుకు తహసీల్దార్, ఎంపీడీఓ అనుమతి తీసుకున్నారు. విగ్రహ ప్రతిష్ట కోసం చందాలు వసూలు చేశారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి రూ.2 లక్షలు, శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలానికి చెందిన ప్రొఫెసర్ సాకే రాజేష్ కుమార్ రూ.7 లక్షల విరాళం అందించారు. పలువురి ద్వారా మొత్తం రూ.15 లక్షలు వసూలు చేసిన భీమ్ రావ్ యువజన సంఘం నాయకులు రాప్తాడులో విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఆదివారం ఆవిష్కరణకు అన్ని ఏర్పాట్లు చేశారు. నెల క్రితమే ఉత్సవానికి సంబంధించి పాంప్లేట్‌లు కొట్టించి అందరికీ పంచారు.

ఆ రెండు పేర్లు తొలగించండి..!

విగ్రహావిష్కరణ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహోదగ్రులైనట్లు తెలిసింది. అధికారులకు ఫోన్ చేసి మండిపడినట్లు సమాచారం . మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి, సాకే రాజేష్ కుమార్ పేర్లు ఉండకూడదని ఆదేశించడంతో అధికారులు ఆగమేఘాలపై స్పందించారు. ఎలాగోలా కార్యక్రమాన్ని అడ్డుకోవాలనే ఉద్దేశంతో విగ్రహ ఏర్పాటుకు పర్మిషన్ లేదంటూ నిర్వాహకులకు పోలీసుల ద్వారా నోటీసులు ఇచ్చారు. పర్మిషన్ తీసుకుని పనులు చేసుకోవాలని, లేని పక్షంలో అరెస్ట్ చేస్తామని పోలీసులు హెచ్చరించినట్లు తెలిసింది.

పార్టీలకతీతంగా విగ్రహాన్ని ఏర్పాటు చేశాం..

నోటీసులపై భీమ్ రావ్ యువజన సంఘం అధ్యక్షుడు కటిక జయరామ్, వైస్ ప్రెసిడెంట్ బాల నాగేంద్ర విలేకరులతో మాట్లాడారు. 2021 నుంచి పనులు జరుగుతున్నా అధికారులు ఏనాడూ అడ్డు చెప్పలేదన్నారు. పార్టీలకతీతంగా చందాలు వసూలు చేశామన్నారు.పాంప్లేట్‌లో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ప్రొఫెసర్ రాజేష్ కుమార్ పేర్లు తొలగించి కార్యక్రమాన్ని చేసుకోవచ్చని సమాచారమిచ్చారన్నారు. సర్పంచు సాకే తిరుపాల్, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ కుమార్ కూడా దళితులే అని, అయినా విగ్రహ ప్రతిష్టకు అనుమతి లేదంటూ అడ్డుపడడం దళిత జాతికే సిగ్గు చేటన్నారు.

ఐ-ఫోన్ కొనివ్వలేదని అదృశ్యం

అనంతపురం: తల్లిదండ్రులు ఐ-ఫోన్ కొనివ్వలేదని ఓ కుమారుడు ఇంట్లో నుంచి అలిగి వెళ్లిపోయాడు. త్రీ టౌన్ సీఐ కే. శాంతిలాల్ తెలిపిన మేరకు.. అనంతపురం నిర్మలానంద నగర్‌లో నివాసముండే పి. మహమ్మద్ రఫీ కుమారుడు దాదార్ మహమ్మద్ ఇంటర్ పూర్తి చేశాడు. ఇటీవల తనకు ఐ-ఫోన్ కొనివ్వాలని తల్లిని కోరగా.. ఆమె నిరాకరించారు. 'ఇప్పుడు ఉన్న ఫోన్‌తో నిరంతరం మాట్లాడుతున్నావు. అంత ఖరీదైన ఫోన్ అవసరం లేదు. చదువుపై దృష్టి పెట్టు' అని పేర్కొన్నారు. దీంతో మనస్తాపం చెందిన మహమ్మద్ శనివారం ఉదయం 8 గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో తల్లిదండ్రులు ఆరా తీసినా ఫలితం లేదు. ఫోన్ స్విచాఫ్ అయింది. దీంతో రాత్రి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

స్నానాల బావిలో నీటమునిగి వ్యక్తి మృతి

నార్పల: స్నానాలబావిలో ప్రమాదవశాత్తూ నీటమునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. గూగూడులో కుళ్లాయిస్వామి దర్శనానికి వచ్చే భక్తులు స్నానమాచరించే బావి(కోనేరు)లోకి ఇదే గ్రామానికి చెందిన రాజశేఖర్ (50) శనివారం ప్రమాదవశాత్తూ పడ్డాడు. నీటమునిగి ఊపిరాడక కొద్దిసేపటికే మృతి చెందాడు. స్థానిక యువకుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాజశేఖర్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

క్లుప్తంగా

'స్టాంప్' కుంభకోణంపై చంద్రబాబు నోరు విప్పాలి

అనంతపురం టవర్‌క్లాక్: నకిలీ స్టాంపుల కుంభకోణంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పాత్ర ఉందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నందున దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నోరు విప్పాలని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి కోరారు. శనివారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 1995లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన తెల్గీ కుంభకోణాన్ని తల దన్నేలా ప్రస్తుత స్టాంపుల కుంభకోణం ఉందన్నారు. ఈ స్కామ్‌ను ఒక వ్యక్తిపై తోసి సురేంద్రబాబు తప్పించు కుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఆర్‌బీఐ, ఫైనాన్స్ మినిస్టర్, ఈడీకి ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రభుత్వం లోతుగా దర్యాప్తు చేస్తే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఈ స్కామ్ సంబంధించి 40 డాక్యుమెంట్లతో రెండు డాక్యుమెంట్లతోనే రూ.900 కోట్లు, మరో డాక్యుమెంటులో రూ.700 కోట్లు, ఇంకో డాక్యుమెంట్‌లో రూ.20 కోట్ల వరకు అవకతవకలు పాల్పడినట్లు తెలుస్తోందని ఆయన ఆరోపించారు. ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్‌కు అనంతపురంలో కార్యాలయం ఉంటే కళ్యాణదుర్గంలో డాక్యుమెంట్లు ఎందుకు కొన్నారని ప్రశ్నించారు. ఎస్‌ఆర్‌సీ ఇన్‌ఫ్రాకు సంబంధించి ప్రతి డాక్యుమెంట్‌నూ విచారణ చేసి ప్రభుత్వ ఖజానాకు డబ్బు చేరిందా లేదా అని చూడాలన్నారు.

ధాబా నిర్వాహకురాలిపై దాడి


గాయపడిన అంజలి

గుత్తి రూరల్: ధాబాను తగులబెట్టేందుకు ప్రయత్నించిన దుండగులు.. అడ్డుకోబోయిన నిర్వాహకురాలిపై విచక్షణా రహితంగా దాడిచేసి గాయపరిచారు. పోలీసులు, బాధితురాలి కథనం మేరకు... ఊబిచెర్ల గ్రామానికి చెందిన ఓబులేసు, అంజలి దంపతులు గ్రామ శివారు 44వ నంబరు జాతీయ రహదారి పక్కన ధాబా హోటల్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి దాబా మూసివేసిన అనంతరం అంజలి అక్కడే నిద్రించింది. అర్ధరాత్రి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి ధాబాలోని వస్తువులను ధ్వంసం చేశారు. అనంతరం పెట్రోలు పోసి తగులబెట్టేందుకు ప్రయత్నిస్తుండగా అలికిడికి అంజలి నిద్రలేచి కేకలు వేసి,అడ్డుకుంది. దీంతో వారు అంజలిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. కేకలు విని సమీపంలోని వారు వస్తుండటం గమనించిన దుండగులు ద్విచక్రవాహనం వదిలి పారిపోయారు. గాయపడిన అంజలిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన వారు దొంగలా.. లేక ఇతర కారణాలతో దాడి చేశారా అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వంకలనూ వదలని తమ్ముళ్లు

- బడా నేతల పేర్లతో బెదిరింపులు
- పట్టించుకోని అధికారులు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో ఇసుక, మట్టి అక్రమ రవాణా ఊపందుకుంది. ఈ క్రమంలో వాగులు, వంకలు, చెరువులు, రస్తాలను సైతం ఆక్రమించేస్తున్నారు. వంకలు, వాగుల్లో పగలు, రాత్రి తేడా లేకుండా భారీ యంత్రాలతో తవ్వుతూ ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.


క్రిష్టిపాడు వంకలో మట్టిని అక్రమంగా తరలిస్తున్న దృశ్యం


వంకలో ఏర్పడిన గుంతలు

పెద్దవడుగూరు: ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రకటించిన సంపద సృష్టి అంశం దేవుడెరుగు కానీ, టీడీపీ నేతలు మాత్రం పేట్రేగిపోయి అక్రమార్జనపై దృష్టి సారించారు. పెద్దవడుగూరు మండలంలో ఈ పరిస్థితి మరీ ఎక్కువగానే కనిపిస్తోంది. మండల పరిధిలోని క్రిష్టిపాడు, ఆవులాంపల్లి, కొండూరు గ్రామాల్లో కొందరు టీడీపీ కార్యకర్తలు బరితెగించి మట్టి, ఇసుక దందాకు తెరలేపారు. ఇదేమని ప్రశ్నించిన అధికారులను బడా నేతల పేర్లు చెప్పి బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో ఈ తలనొప్పి తమకెందుకు అనే ధోరణితో అధికారుల్లో ఉదాసీనత వ్యక్తమవుతోంది.

తగ్గు ప్రాంతాల చదును కోసమని

రెండు వారాల క్రితం తగ్గు ప్రాంతాలను చదును చేసుకునేందుకు కొందరు రైతులు వంకల్లోని మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలించే ప్రయత్నం చేశారు. ఈ డిమాండ్‌ను గుర్తించిన స్థానిక టీడీపీ కార్యకర్తలు వెంటనే మట్టి తరలింపులను అడ్డుకున్నారు. గ్రామాల్లో ఉన్న విభేదాలతో గొడవలకు తెరలేపారు. దీంతో రైతుల తమ పొలాలకు మట్టిని తరలించుకోవడం మానేశారు. ఇదే అదనుగా భావించిన టీడీపీ కార్యకర్తలు చెలరేగిపోయారు. మండల కేంద్రం నుంచి కొండుపల్లికి వెళ్లే మార్గంలోని గ్రామ శివారున ప్రధాన రహదారి పక్కన ఉన్న వంకలోని మట్టిని అక్రమంగా తరలించి పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకోసాగారు. జేసీబీలను పెట్టి మరీ మట్టి తవ్వకాలు చేపట్టడంతో రోజుల వ్యవధిలోనే వంకలో భారీ ఎత్తున గుంతలు ఏర్పడ్డాయి.

దిక్కున్న చోటు చెప్పుకోండి

మట్టి అక్రమ తవ్వకాలపై ఎవరైనా ప్రశ్నిస్తే బడా నాయకుల పేర్లు చెప్పి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. రెవెన్యూ, పోలీసుల నుంచి అనుమతులు తీసుకున్నామని, దిక్కున్న చోటుకెళ్లి చెప్పుకోండి అంటూ దౌర్జన్యానికి తెరలేపడంతో సామాన్యులు మాట్లాడలేకపోతున్నారు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా వంకలోని మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వారం రోజులుగా వంకలో మట్టి తరలింపులు కొనసాగిస్తుండడంతో ఇప్పటికే 15 అడుగుల లోతుతో, నాలుగు మీటర్ల వెడల్పుతో, సుమారుగా 20 మీటర్లకు పైగా పొడవునా భారీగా గోతులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులు, వంకల్లో మట్టిని తరలించకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అనుమతులు ఇవ్వలేదు

పెద్దవడుగూరు మండలం నుంచి మట్టి, ఇసుక తవ్వకాలు, తరలింపులకు అనుమతులు ఇవ్వలేదు. నిబంధనలు ఉల్లంఘించి మట్టి, ఇసుక అక్రమ తరలింపులు చేపడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటాం. మట్టి, ఇసుక తరలించాలంటే మైనింగ్ అండ్ జియాలజీ శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి.

– ఉషారాణి, తహసీల్దార్, పెద్దవడుగూరు

ఢిల్లీలో శిక్షణకు వజ్రకరూరు సర్పంచ్


శిక్షణలో పాల్గొన్న సర్పంచ్ మోనాలిసా

వజ్రకరూరు: ఢిల్లీలోని డాన్‌బోస్కో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శనివారం ప్రారంభమైన 'షీ లెప్రజెంట్స్–2025' అనే ప్రతిష్టాత్మక నాయకత్వ అభివృద్ధి– శిక్షణకు వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా హాజరయ్యారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ డెమోక్రసీ అనే సంస్థ దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించి.. ప్రజలకు మెరుగైన సేవలందించడంతో పాటు మంచి నాయకత్వ లక్షణాలు, సామర్థ్యం కలిగిన 45 మంది మహిళా ప్రజాప్రతినిధులను ఎంపిక చేశారు. అందులో వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా ఒకరు. వీరికి ఏడు రోజులపాటు పాలన, కమ్యూనికేషన్, ప్రజానైతికత, నాయకత్వ నైపుణ్యాలు, సమస్యలు–వాటిపరిష్కార పద్ధతులు, పార్లమెంట్ సందర్శన తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు. మోనాలిసా మాట్లాడుతూ ఢిల్లీ శిక్షణకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు.

సిగ్నల్ లోపం.. ఆగిన రైలు

తాడిపత్రి రూరల్: కోమలి రైల్వే స్టేషన్‌లో ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థలో సాంకేతిక లోపం తలెత్తి ధర్మవరం – మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్ గంటకు పైగా నిలిచిపోయింది. తాడిపత్రి రైల్వే స్టేషన్‌కు రాత్రి 7.24 గంటలకు రావాల్సి ఉండగా.. సిగ్నల్ లోపం కారణంగా 8.33 గంటలకు వచ్చింది. రెండు రోజుల క్రితం ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థకు సంబంధించిన ప్యానల్ బోర్డు ఏర్పాటు చేశారు. వారం క్రితం కోమలి రైల్వే స్టేషన్‌లో తెల్లవారుజామున ఒక దుండగుడు సిగ్నల్ వ్యవస్థకు సంబంధించిన వైర్లను తొలగించారు. సిగ్నల్ పడకపోవడంతో స్టేషన్ బయట నిలిచి ఉన్న రైలులోకి చొరబడిన దుండగుడు ప్రయాణికురాలు వనజాక్షి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లాడు. మరోసారి ఇలాంటి సంఘటన పునరావృతమైందన్న భయం ప్రయాణికుల్లో ఏర్పడింది. సిగ్నల్ వ్యవస్థలో ఏర్పడ్డ సాంకేతిక లోపం వల్ల రైలు నిలిచిపోయిందని తెలియడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సాంకేతిక సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన సిగ్నల్ వ్యవస్థను పునరుద్ధరించి రైలును ముందుకు పంపించారు.

ట్రాక్టర్ యజమానులకు టోకరా

ఆత్మకూరు: తాను స్థాపించబోయే కంపెనీకి సంబంధించి మట్టి పనులు ఇప్పిస్తానని ట్రాక్టర్ యజమానుల నుంచి డబ్బు వసూలు చేసిన ఓ ఘరానా మోసగాడి ఉదంతం వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంకటేష్ అనే వ్యక్తి వారం రోజులుగా ఆత్మకూరు మండలం తోపుదుర్తిలో తిరుగుతున్నాడు. తాను బాంబే ఫ్యాషన్ లిమిటెడ్ కంపెనీ పెడుతున్నానని, దాదాపు పది ఎకరాల్లో రెండేళ్లపాటు మట్టి పని ఉంటుందని, ఇందుకు ట్రాక్టర్లు అవసరమవుతాయని పలువురికి తెలియజేశాడు. ట్రాక్టర్ ఉన్నవారు తనతో అగ్రిమెంట్ చేసుకుంటే పని కల్పిస్తానని చెప్పాడు. దీన్ని నమ్మి ముందుకు వచ్చిన 14 మంది ట్రాక్టర్ యజమానుల నుంచి రూ.12వేల నుంచి రూ.13,500 తీసుకుని అగ్రిమెంట్ చేయించాడు.

మోసం వెలుగులోకి ఇలా...

తోపుదుర్తికి చెందిన ఓ ట్రాక్టర్ యజమాని అగ్రిమెంట్ చేసుకునేందుకు డబ్బు అవసరమై తాడిమర్రి మండలం అగ్రహారంలో ఉండే బంధువుకు ఫోన్‌లో సంప్రదించాడు. సదరు వ్యక్తి ఫొటో పంపించు ఒకసారి చూస్తా అని అడగడంతో వాట్సాప్‌లో పంపించాడు. ఆ వ్యక్తిని చూసి ఇతను గతంలో తాడిమర్రి మండలంలో కూడా ఇలాగే డబ్బు వసూలు చేసి మోసం చేశాడని తెలిపాడు. అప్రమత్తమైన ట్రాక్టర్ యజమాని, తోపుదుర్తి గ్రామస్తులకు తెలియజేయడంతో వారు శుక్రవారం రాత్రి వెంకటేష్‌ను కలిసి తమ డబ్బు వెనక్కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేసేదిలేక వెంకటేష్ కొంతమందికి డబ్బు తిరిగిచ్చేశాడు. అనంతరం గ్రామస్తుల సమాచారంతో మోసగాడిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.

పలు స్టేషన్లలో కేసులు

ట్రాక్టర్ యజమానులను మోసం చేస్తున్న వెంకటేష్‌పై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఇందులో భాగంగా తాడిమర్రి మండలంలో 60 మంది నుంచి రూ.9లక్షల దాకా డబ్బు వసూలు చేసి మోసం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇతడిని తాడిమర్రి పోలీసులకు అప్పజెబుతున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా వెంకటేష్ శ్రీసత్యసాయి జిల్లా గుడిబండ మండలానికి చెందిన వాడు కాగా.. ప్రస్తుతం యాడికిలో నివాసం ఉంటున్నట్లు వెల్లడించారు.

పని ఒత్తిడి తగ్గించండి


ధర్నా చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

అనంతపురం అర్బన్: పని ఒత్తిడి తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. తమ సమస్యలపై ఏపీ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వర్ల శంకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించాలన్నారు. అన్ని రకాల సర్వేలు, స్వర్ణ పంచాయతీ పనులు, ఇంటి పన్ను వసూళ్లు, పీఆర్ ఎస్‌యాప్, గ్రామ సచివాలయ సర్వేలు, రెవెన్యూ, పీజీఆర్ఎస్ పనులు, గ్రామ సభలు, గ్రామ పంచాయతీ సమావేశాలు, ప్రోటోకాల్ విధులు ఇలా పలు రకాలు పనులు పంచాయతీ కార్యదర్శులతో చేయిస్తుండడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామన్నారు. ఇదే క్రమంలో ఆరోగ్యాలు పాడవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ఐవీఆర్ఎస్ కాల్స్ పేరుతో ఫిర్యాదులు వచ్చాయంటూ తమపై చర్యలు తీసుకుంటూ మరింత మనోవేదనకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శుల్లో చాలామంది మహిళలు, వయసు పైబడిన వారు ఉన్నారన్నారు. వీరి గురించి అధికారులు ఆలోచించాలన్నారు. పంచాయతీ కార్యదర్శిని సచివాలయంలో జరిగే సంక్షేమ పథకాల సర్వే విధుల నుంచి తొలగించాలన్నారు. పీఎస్ లాగిన్‌కు సంబంధించి పీజీఆర్ఎస్ సమస్యలను ఆయా శాఖల వారికే కేటాయించాలన్నారు. పీఎస్‌ల అన్ని గ్రేడ్లలోనూ పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగ నిర్వహణలో విపరీతమైన ఒత్తిడికి గురవుతున్నామన్నారు. ప్రధానంగా ఉదయం 6 గంటల నుంచి పారిశుధ్య పనులతో మొదలుకొని, గ్రామ, వార్డు సచివాలయ సర్వేలు మనమిత్ర, ఈ–కేవైసీ, ఎంబీయూ, జియో ట్యాగింగ్, బియ్యం కార్డు, తదితర వాటితో పాటు రోజూ రెండు లేదా మూడు వెబెక్స్, గూగుల్ మీటింగ్‌లు మరింత ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. ఇవి కాకుండా వాట్సాప్ మెసేజ్‌లు, స్ప్రెడ్‌షీట్, ఫొటోలు, వీడియోల అప్‌డేట్‌లు, ప్రజల మొబైల్ ఫోన్ నుంచి ఓటీపీ మెసేజ్ సేకరణ వంటి పనులు చేస్తున్నారన్నారు. ఇలా విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను, ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు భీమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటరాముడు, కార్యదర్శి రాఘవేంద్ర, సభ్యులు శివమూర్తి, శ్వేత పద్మిని, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

రైల్లో ప్రయాణికురాలి మృతి


మృతురాలు లక్ష్మీబాయి

గుత్తి: రైల్లో ప్రయాణిస్తున్న మహిళ హైషుగర్‌తో కుప్పకూలి మృతి చెందింది. జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప తెలిపిన మేరకు... బెంగళూరులోని యలహంకకు చెందిన లక్ష్మీబాయి (53) కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఇటీవల పూరి యాత్రకు వెళ్లారు. యాత్ర ముగించుకుని 'పూరి ఎక్స్‌ప్రెస్'లో యలహంకకు బయల్దేరారు. గుత్తి రైల్వే స్టేషన్ సమీపంలోకి వచ్చినపుడు లక్ష్మీబాయి షుగర్ పెరిగిపోయి కుప్పకూలింది. కుటుంబ సభ్యులు ఎంత లేపినా లేవలేదు. అప్పటికే ఆమె మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం లక్ష్మీబాయి మృత దేహాన్ని జీఆర్పీ పోలీసులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నిందితుడికి రిమాండ్

పామిడి: వివాహిత అనుమానాస్పద మృతి కేసులో నిందితుడిని రిమాండ్‌కు పంపించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ యుగంధర్ శనివారం రాత్రి మీడియాకు వెల్లడించారు. పామిడిలోని ఫారెస్ట్ బంగ్లా వద్ద నివాసముంటున్న ఈశ్వర్‌రెడ్డి భార్య రాజేశ్వరి (28) గత నెల 21న వంకరాజు కాలవ్వ గ్రామానికి వెళ్లే మార్గంలోని మోరీ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం విదితమే. రాజేశ్వరితో నాగిరెడ్డికాలనీ వాసి వంగనూరు భాస్కర్ (37)కు ఆ రోజు ఘర్షణ జరిగింది. కోపంలో తోసేయడంతో రాజేశ్వరి తీవ్రంగా గాయపడి మృతి చెందింది. ఈ మేరకు భాస్కర్ శనివారం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. తాడిపత్రి జడ్జీ ఆదేశాల మేరకు నిందితుడు భాస్కర్‌ను గుత్తి సబ్‌జైలుకు రిమాండ్‌కు పంపినట్లు సీఐ చెప్పారు.

నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు

అనంతపురం అగ్రికల్చర్: బదిలీల ప్రక్రియ ఇష్టారాజ్యంగా చేస్తున్నారంటూ పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామిపై విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ (వీఏహెచ్‌ఏ) ఫైర్ అయ్యారు. శనివారం వీఏహెచ్‌ఏల అసోసియేషన్ అధ్యక్షుడు వై.శివ ఆధ్వర్యంలో నాయకులు, పలువురు వీఏహెచ్‌ఏలు నగరంలోని పశుశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జేడీకి, అసోసియేషన్ నాయకులకు మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలు జరిగాయి. ఇష్టమొచ్చినట్లు బదిలీల ప్రక్రియ చేస్తున్నారంటూ వీఏహెచ్‌ఏలు మండిపడ్డారు. బయట ముగ్గురిని పెట్టుకుని లావాదేవీలు సాగిస్తున్నారని ప్రచారం జరుగుతోందంటూ నిలదీశారు. రెండు మూడు రోజుల్లో మీరు రిటైర్ అవుతున్నారని, ఇలా నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేసి వెళ్లిపోతే ఐదేళ్లు తాము కష్టాలు పడాల్సి ఉంటుందని జేడీతో వాదించారు. మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రక్రియ పూర్తి చేస్తామనడంతో వీఏహెచ్‌ఏలు వెనుదిరిగారు.

- కాగా అంతకుముందు వీఏహెచ్‌ఏల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

అర్ధంతరంగా ఆగిన బదిలీలు

అనంతపురం సిటీ: తప్పుడు స్పౌజ్ సర్టిఫికెట్లు సమర్పించారంటూ ఆందోళనకు దిగడంతో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీ అర్ధంతరంగా ఆగింది. అనంతపురంలోని పంచాయతీరాజ్ సర్కిల్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమైంది. సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.జహీర్ అస్లాం ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగింది. సాయంత్రం 5.50 వరకు కౌన్సెలింగ్ సజావుగా సాగింది. ఈ క్రమంలోనే కొందరు సచివాలయ ఉద్యోగులు పెళ్లి కాకపోయినా..తప్పుడు స్పౌజ్ సర్టిఫికెట్లు సృష్టించి సమర్పించారంటూ అభ్యర్థులు ఆందోళనకు దిగడంతో విధిలేక అధికారులు కౌన్సెలింగ్ నిలిపివేశారు.

బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టండి: కలెక్టర్

అనంతపురం అర్బన్: సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఆర్‌ఓ ఎ.మలోలతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు కౌన్సెలింగ్ చేపట్టాలని, అక్రమ మార్గంలో బదిలీ పొందేందుకు తప్పుడు పత్రాలు తీసుకొచ్చేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సొంత మండలానికి బదిలీ చేయకూడదని చెప్పారు. సమావేశంలో నగర పాలక కమిషనర్ బాలస్వామి, కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల సిఫార్సులకే ప్రాధాన్యత

- ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియలో పారదర్శకత కరువు


కౌన్సెలింగ్ హాలు వద్ద ఎగబడుతున్న వీఏఏలు

అనంతపురం అగ్రికల్చర్: రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే) అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ, కౌన్సెలింగ్ గందరగోళంగా తయారైంది. పారదర్శకత కరువైంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రక్రియ సాగిస్తుండడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. పలుకుబడి, డబ్బు, ప్రజాప్రతినిధుల సిఫార్సులకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హత, సీనియార్టీ పక్కన పెట్టి ఇష్టారాజ్యంగా బదిలీల ప్రక్రియ చేపడుతున్నారని అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు అసిస్టెంట్లు మండిపడుతున్నారు.

ప్రణాళికేదీ...?

కలెక్టర్ అనుమతితో ఈనెల 30లోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ క్రమంలో శనివారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా పరిధిలో పనిచేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ (వీఏఏ)కు నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియ గందరగోళంగా తయారైంది. రెండు జిల్లాల జేడీఏలు ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు, సూపరింటెండెంట్ల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. పద్ధతి, ప్రణాళిక లేకుండా చేపట్టడంతో ఏం జరుగుతుందనే వీఏఏలు ఆందోళనతో ఎగబడ్డారు. ర్యాంకులు, మెరిట్ ప్రకారం వీఏఏలు పట్టుబట్టగా, అధికారులు మాత్రం డేట్ ఆఫ్ జాయినింగ్ ప్రకారం కొనసాగిస్తామని చెప్పారు. దీంతో కౌన్సెలింగ్ ప్రక్రియ గంట పాటు నిలిపేశారు. చివరకు ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్‌కు అధికారులు అంగీకరించారు.

సోమవారం ఉత్తర్వులు..

ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం పోస్టులు 282 ఉండగా... అందులో పనిచేస్తున్న వారు 248 మంది ఉన్నారు. అందులో ఐదేళ్లు పూర్తి చేసుకున్న వీఏఏలు 229 మంది బదిలీకి అర్హత ఉన్నట్లు తెలిపారు. మరో 19 మంది రిక్వెస్ట్ కింద దరఖాస్తు చేసుకున్నారు. అటు ఉద్యానశాఖ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 323 మంది వీహెచ్‌ఏలు ఉండగా అందులో ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారు 280 మందికి బదిలీలు చేపట్టారు. మరికొందరు రిక్వెస్ట్ కింద దరఖాస్తు చేసుకున్నారు. శనివారం రెండు జిల్లాల నుంచి తరలివచ్చిన వీహెచ్‌ఏలు ఆప్షన్లు ఇచ్చేశారు. సోమవారం సాయంత్రానికి బదిలీ ఉత్తర్వులు ఇస్తామని అధికారులు తెలిపారు. ఖాళీల వివరాలపై స్పష్టత ఇవ్వకపోవడంతో ఆప్షన్లు ఇవ్వడానికి వీహెచ్‌ఏలు కూడా ఇబ్బంది పడ్డారు. పట్టుపరిశ్రమశాఖ అసిస్టెంట్ల బదిలీలు శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరగనున్నట్లు అధికారులు తెలిపారు.

'ఉపాధి' అక్రమాలపై విచారణ చేపట్టాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ఉపాధి హామీ పనుల్లో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ చేపట్టి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధి అక్రమాలపై విచారణకు, పంచాయతీ రాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ఈ నెల 30 రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లలో జరిగే 'ప్రజా సమస్యల పరిష్కారవేదిక'లో కలెక్టర్లకు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. శనివారం ఆయన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రం విడుదల చేసిన రూ.1150 కోట్ల పంచాయతీరాజ్ నిధులను సీఎం చంద్రబాబు ఇతర పనులకు బదలాయిస్తే.. ఎన్నికలకు ముందు మీ గొంతుకనవుతా.. ప్రశ్నిస్తానన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. సొంత శాఖకు చెందిన డబ్బులు ఇతర అవసరాలకు వాడితే గ్రామాభివృద్ధి ఎక్కడ సాధ్యపడుతుందని ప్రశ్నించారు. సర్పంచ్‌లకు 'తల్లికి వందనం' అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీఓ 11 రద్దు చేసి.. 1,350 మంది పంచాయతీ కార్యదర్శులకు పోస్టింగ్‌లు ఇచ్చి 10 నెలలుగా జీతాలు విడుదల చేయలేదన్నారు. గ్రామాల్లో వసూలు చేస్తున్న ఇంటి పన్నును స్థానిక సంస్థల ఖాతాల్లోకి జమచేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు యోగేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కిరణ్, నాయకులు అంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

జీజీహెచ్ ఎమర్జెన్సీలో భయం.. భయం

- ఈ ఏడాది మే 31న ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డులో ఉదయ్ కుమార్ అనే యువకుడు తప్పతాగి వచ్చి నానా హంగామా చేశాడు. వైద్యులు, స్టాఫ్‌నర్సులపై దుర్భాషలాడటమే కాకుండా వారిపై దాడికి యత్నించాడు. చివరకు అతడికి వస్తున్న రక్తాన్ని సిబ్బందిపై చల్లే ప్రయత్నం చేసి ఎమర్జెన్సీ వార్డులో భయానక వాతావరణం సృష్టించాడు. ఆలస్యంగా స్పందించిన పోలీసులు ఉదయ్ కుమార్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లినా.. మళ్లీ వదిలేశారు.

- ఈ ఏడాది జనవరిలో అర్ధరాత్రి ఇద్దరు తప్పతాగి క్యాజువాలిటీకి వచ్చారు. వైద్యం చేయాలంటూ వైద్యులు, సిబ్బందిపై దాడికి యత్నించారు. చివరకు కొట్టుకునే పరిస్థితి ఏర్పడింది. ఆస్పత్రిలో నిత్యం ఇటువంటి సంఘటనలు తీవ్ర భయాందోళన రేకెత్తిస్తున్నాయి. అర్ధరాత్రిలో క్యాజువాలిటీకి వచ్చే కేసుల్లో 30 శాతానికిపైగా తాగుబోతుల కేసులే ఉన్నాయి. ఇలాగైతే తాము ఎలా పని చేయాలని సీఎంఓలు, స్టాఫ్‌నర్సులు, తదితర సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- రాత్రి వేళల్లో తాగుబోతుల హల్‌చల్
- వైద్యం పేరుతో వైద్యులు, సిబ్బందిపై దురుసు ప్రవర్తన
- చోరీకి గురవుతున్న వాహనాలు
- నియంత్రించలేని స్థితిలో సెక్యూరిటీ, ఔట్‌పోస్టు పోలీసులు





ఎమర్జెన్సీ వార్డులో వైద్య సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న ఉదయ్ కుమార్ (ఫైల్)

అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వంలో తాగుబోతులు, అల్లరి మూకలు, దొంగలు రెచ్చిపోతున్నారు. రాత్రి వేళల్లో పూటుగా మద్యం సేవించి గొడవలు, ప్రమాదాలకు గురై సర్వజనాస్పత్రికి వస్తున్నారు. ఆస్పత్రిలో వైద్యం చేయించుకుని వెళ్తారా అంటే అదీ లేదు. వైద్యులు, సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడం, కేకలు వేసి అలజడి వాతావరణం సృష్టిస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. ఇదే అదునుగా దొంగలు రెచ్చిపోతున్నారు. అవకాశం దొరికినప్పుడల్లా వాహనాలను ఎత్తుకెళ్తున్నారు. అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చే రోగుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన సెక్యూరిటీ, ఔట్‌పోస్టు పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ఆలస్యంగా స్పందిస్తున్నారు. ఇక టూటౌన్ పోలీసులు నిత్యం ఆస్పత్రిలో గస్తీలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఔట్‌పోస్ట్ పోలీసులు ప్రొటోకాల్ డ్యూటీపై శ్రద్ధ తీసుకోవడం లేదు. ఆస్పత్రికి వచ్చే వారి బంధువులు, అనుయాయులను డాక్టర్లకు చూపించుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కనీసం ఇప్పటికైనా స్పందించి బాధ్యతగా విధులు నిర్వర్తిస్తే వైద్య సిబ్బందికి ఇబ్బందులు తప్పుతాయి. అదేవిధంగా ఆస్పత్రి అధికారులు సైతం రాత్రి వేళల్లో వార్డులను పరిశీలించి, అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీయాల్సి ఉంది. కానీ అటువంటి పరిస్థితి లేదు. ఉదయం 9 గంటలకు వచ్చి మధ్యాహ్నానికంతా వెళ్లిపోతున్నారు.

రెచ్చిపోతున్న దొంగలు..

ఈ ఏడాది ఏప్రిల్ 28న సర్వజనాస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో ఓ హౌస్‌సర్జన్‌కు చెందిన రూ.లక్ష విలువ చేసే సెల్‌ఫోన్‌ను అక్కడే విధులు నిర్వర్తించే ఓ టెక్నీషియన్ విద్యార్థి ఎత్తుకెళ్లాడు. మూడ్రోజుల తర్వాత ఆ విషయం వెలుగు చూసింది. కానీ ఆ విద్యార్థిపై ఎటువంటి చర్యలు లేవు. అలాగే ఇటీవల ఆస్పత్రిలో ఎన్‌టీఆర్ వైద్య సేవ కింద డబ్బు వేయిస్తామంటూ కొందరు ఆగంతకులు రోగులను పీల్చిపిప్పి చేస్తున్నారు. నేరుగా ఫోన్‌లకు డబ్బులు వేయించుకుంటున్నారు. కానీ వీటిపై రోగులు, వారి సహాయకులకు అవగాహన కల్పించడంలో ఆస్పత్రి అధికారులు విఫలమయ్యారు. ఇక ఆస్పత్రిలో ప్రతి నెలా కనీసం రెండు వాహనాలు చోరీకి గురవుతున్నాయి. ఆస్పత్రి ఆవరణలో పార్కింగ్ సౌకర్యం సరిగా లేకపోవడంతో పాటు రాత్రి వేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నారు. వీరిని పట్టించుకునే నాథుడే లేరు. సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో దొంగలు మరింత రెచ్చిపోతున్నారు. జిల్లా కేంద్రంలోనే ఇటువంటి పరిస్థితి ఉంటే ఇక మిగతా ప్రాంతాల్లో జిల్లా పోలీసు శాఖ ఏ మేరకు దృష్టిసారించిందో చెప్పాల్సిన పనిలేదు.

క్లుప్తంగా

'చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దు'

- జెడ్పీ సీఈఓ శివశంకర్



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శివశంకర్

ఆత్మకూరు: ఇంటింటా తిరిగి చెత్త సేకరించాలని జెడ్పీ సీఈఓ శివశంకర్ పంచాయతీ కార్మికులకు సూచించారు. శనివారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయలక్ష్మి, ఈఓఆర్డీ కామక్కతో కలసి ఆత్మకూరులో పర్యటించారు. చెత్త సేకరణపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాపారులు, అంగళ్ల వారు ఇళ్లలో ఉన్న చెత్త రోడ్లపై వేయరాదని సూచించారు. తడి, పొడి చెత్తను పంచాయతీ వాహనాలకు అందజేయాలని తెలిపారు. ప్రతి ఇంటికి తిరిగి చెత్త సేకరించాలని కార్మికులకు సూచించారు. చెత్త సేకరించే ఈ-రిక్షాలు, వాహనాలకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అనంతరం చెత్త సేకరణ కేంద్రం వద్దకు వెళ్లి తడి చెత్త, పొడి చెత్త తయారీని పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు.

మొహర్రం వేడుకలకు అనుమతి తప్పనిసరి

చెన్నేకొత్తపల్లి: మొహర్రం వేడుకలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా గ్రామాల్లో మొహర్రం పండుగను జరుపుకునే వారు ముందుగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పోలీసుల అనుమతి పొందిన తరువాతనే మొహర్రం పండుగకు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

పిల్లలను బడిలో చేర్పించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ నరసింహారెడ్డి

ఆత్మకూరు: మండలంలోని గ్రామాల్లో బడికి వెళ్లకుండా.. బడి మధ్యలో మానేసిన ప్రతి ఒక్కరిని బడికి పంపించాలని ఎంఈఓ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సీఆర్‌పీలు, ఐఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. బడికి రాకుండా ఉన్న పిల్లల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి పిల్లల్ని బడికి పంపేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. బడి మానేసిన పిల్లలు బయట కనపడకూడదని సూచించారు. బాల కార్మికులు ఎక్కడైనా ఉంటే వారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు.

హెడ్‌నర్స్ గౌరమ్మ సేవలు ఆదర్శప్రాయం



హెడ్‌నర్స్ గౌరమ్మను అభినందిస్తున్న గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి

అనంతపురం మెడికల్: హెడ్‌నర్స్ గౌరమ్మ సేవలు ఆదర్శప్రాయమని గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి పేర్కొన్నారు. శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో హెడ్‌నర్సు గౌరమ్మ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా స్టాఫ్‌నర్సు, హెడ్‌నర్సుగా గౌరమ్మ అందించిన సేవలు మరువలేనివన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ ఉత్తమ సేవలందించారన్నారు. ఆమె శేష జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. గౌరమ్మ సేవలను సూపరింటెండెంట్ ఆత్మారాం అభినందించారు. గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్లు నిర్మల బాయి, నాగమణి మాట్లాడుతూ.. గౌరమ్మ మృదు స్వభావి అని.. ఆమె అందించిన సేవలను కొనియాడారు. అనంతరం హెడ్‌నర్సులు, స్టాఫ్‌నర్సులు, అసోసియేషన్ నాయకులు గౌరమ్మను సన్మానించారు.

వివాహిత అదృశ్యం



భర్త, కుమారుడితో రమాదేవి (ఫైల్)

అనంతపురం: నగరంలోని ఐదో రోడ్డు పెద్దమ్మ గుడి వద్ద నివాసం ఉంటున్న గందె గిరీష్ కుమార్ భార్య గందె రమాదేవి (30) అదృశ్యమైంది. వివరాలు.. నెల రోజుల క్రితం భర్తతో గొడవపడిన రమాదేవి.. పుట్టింటికి వెళ్లిపోయింది. గిరీష్ కుమార్ అత్తగారింటికి వెళ్లి భార్య గురించి ఆరా తీశాడు. పది రోజుల క్రితం తన కొడుకుతో ఎక్కడికో వెళ్లిపోయిందని ఆమె తల్లిదండ్రులు తెలిపారు. రమాదేవి ఆచూకీ కనుక్కోవాలని కోరుతూ భర్త గిరీష్ కుమార్ శనివారం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కే.శాంతిలాల్ తెలిపారు. రమాదేవి ఆచూకీ తెలిసిన వారు త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

ఈవీఎంలకు పటిష్ట భద్రత ఉండాలి



ఈవీఎం భద్రపరిచిన గోదాముకు సీల్ వేయిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఈవీఎంలు భద్రపరిచిన గోదాముల వద్ద పటిష్ట భద్రత ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గోదాముల వద్ద నిరంతర నిఘా కొనసాగాలని చెప్పారు. నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని గోదాములను కలెక్టర్ శనివారం సందర్శించి వాటిలో భద్రపరిచిన ఈవీఎంలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయాన మాట్లాడుతూ వర్షకాలం ప్రారంభమైన నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంత భారీ వర్షం కురిసినా గోదాముల్లోకి నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాల నిఘా నిరంతరం కొనసాగాలన్నారు. భద్రత విషయంలో ఏ దశలోనూ అలసత్వానికి తావివ్వకూడదని ఆదేశించారు. అనంతరం లాగ్‌బుక్‌లో సంతకం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎ.మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, కో-ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, ఎన్నికల విభాగం ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పల్లెలకు ఆర్టీసీ బస్సులు నడపాలి



ఆర్టీసీ ఆర్‌ఎం సుమంత్ ఆర్.ఆదోనికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు

అనంతపురం క్రైం: ప్రభుత్వ బడులను మూసి వేసేందుకు కూటమి సర్కారు కుట్రలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనా చాలా గ్రామాలకు బస్సులు లేవు. దీంతో చాలా మంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బడి బస్సులు నడపాలని కోరుతూ శనివారం ఆర్టీసీ ఆర్‌ఎం సుమంత్ ఆర్.ఆదోనికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. తక్షణం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు బస్సు సౌకర్యంతో పాటు వసతి గృహాలు ఏర్పాటు చేసి విద్యను ప్రోత్సహించాలని కోరారు. ఆర్టీసీ అధికారులు ప్రతి పల్లెకు ఆర్టీసీ బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా ఇంటర్ కళాశాలల వేళలు మార్పు చేయడంతో చాలా మంది విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. సమయం పెంచే ముందు వాటికి సంబంధించిన సమస్యల మూలాలను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కార్పొరేట్ వ్యవస్థను బలపరచడానికి ఇంటర్ విద్యార్థులకు సమయం పెంచారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్లు పెరిగాయన్నారు. నో అడ్మిషన్ బోర్డులు దర్శనమిచ్చేవని కొనియాడారు. నేడు పరిస్థితి ఇందుకు పూర్తిభిన్నంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్, మంజునాథ్‌రెడ్డి, కార్యదర్శులు కైలాష్, కార్యదర్శులు అశోక్, నిశాంత్‌రెడ్డి, నగర అధ్యక్షులు కై లాష్, కార్యదర్శి ఫయాజ్, రాహుల్, గౌస్, అమీర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న

రాప్తాడు: అనంతపురం రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో జూలై 1 నుంచి ముఖ ఆధారిత హాజరుతోనే పౌష్టికాహారం పంపిణీ చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. శనివారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-5లో ఐసీడీఎస్ సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు అమలు చేస్తున్న ముఖ ఆధారిత హాజరుపై నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరూ నమోదు చేయాలన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రీస్కూల్ కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలన్నారు. చిన్నారులకు ఆట పాటలతో విద్యాబోధన చేయాలని సూచించారు. యాప్‌లకు సంబంధించిన పెండింగ్ డేటా నమోదును నెలఖారులోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మీ సేవలు అమూల్యం



బదిలీ అయిన అధికారులతో కలెక్టర్, ఇతర అధికారులు

అనంతపురం అర్బన్: జిల్లా అభివృద్ధికి మీరు అందించిన సేవలు అమూల్యమని బదిలీపై వెళ్తున్న అధికారుల సేవలను కలెక్టర్ వినోద్‌కుమర్ కొనియాడారు. బదిలీపై వెళుతున్న 17 మంది అధికారులకు జిల్లా యంత్రాంగం తరపున శనివారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బదిలీ అధికారులను ఘనంగా సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులుగా మీ సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ఎక్కడున్నా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి ఉన్నతాధికారులు, ప్రజల మన్ననలు అందుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎ.మలోల, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రైతు సంస్థలను బలోపేతం చేసుకుందాం



మాట్లాడుతున్న రైతు సంస్థ నిర్వాహకులు

ఆత్మకూరు: మండల కేంద్రంలో శనివారం రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో తొమ్మిదో వార్షిక మహాసభ నిర్వహించారు. సీఈఓ మరళి, ఎస్‌ఏడీఎల్ కో-ఆర్డినేటర్ రుద్రయ్య, అగ్రికల్చర్ స్పెషలిస్ట్ వీరభద్ర మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి మోసం జరగకుండా న్యాయం జరిగేలా రైతు సంస్థలను బలోపేతం చేద్దామని తెలిపారు. రైతు సంస్థలో మొత్తం 487 మంది రైతులు వాటాదారులుగా ఉన్నారన్నారు. రైతు సంఘంలో వ్యాపార లావాదేవీల ఆడిట్ నివేదికలు, పంట కొనుగోలు అమ్మకాల వివరాలను వాటాదారులకు తెలియజేశారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏఎఫ్ ఎకాలజీ సంస్థ సహకారంతో ఈ రైతు సంస్థను ఏర్పాటు చేసుకున్నట్లు వెల్లడించారు. రైతులు పండించిన పంటలను రైతుల సంస్థలకే అమ్మాలన్నారు. అందరం కలసి రైతు సంస్థలను బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీమ్ లీడర్ ఓబుళపతి, ఏఈఏ షామీర్, మేనేజర్ కళ్యాణ్‌కుమార్, రైతు సంస్థ సీఈఓ మంజునాథ్, మోహన్, నారాయణ స్వామి, ఎస్‌టీఓలే సబిహా అకర్నా, చౌడయ్య, మల్లేష్, మల్లికార్జున రైతులు పాల్గొన్నారు.

'రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం వద్దు'



మాట్లాడుతున్న తహసీల్దార్ మోహన్‌కుమార్

రాప్తాడురూరల్: 'అనంతపురం రూరల్ మండలంలో మొత్తం 3,527 మంది 60 ఏళ్ల పైబడిన వారుంటే ఇప్పటిదాకా కేవలం 1,100 మందికి మాత్రమే ఇంటి వద్దకు వెళ్లి రేషన్ సరుకులు అందజేశారు. ఈనెల 30 వరకు గడువు ఉంది. అంటే కేవలం రెండు రోజుల్లోనే తక్కిన 3,417 మందికి ఇవ్వాల్సి ఉంది. వీఆర్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఈ మొత్తం అందరికీ రేషన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి' అని అనంతపురం రూరల్ మండల తహసీల్దార్ మోహన్‌కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన వీఆర్‌ఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 60 ఏళ్లు దాటిన వృద్ధుల ఇంటి వద్దకు వెళ్లి రేషన్ అందజేసే విషయంలో ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దని ఆదేశించారు. కలెక్టర్ ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అలాగే పింఛన్ల పంపిణీ విషయంలోనూ చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. 1వ తేదీ ఉదయం 11 గంటల్లోపు మీ పరిధిలోని పింఛన్ల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా వీఆర్‌ఓల వద్దే పెండింగ్ ఉన్నాయన్నారు. ఎవరికి వారు వాటిని పూర్తిచేసి పంపాలని సూచించారు. కక్కలపల్లి, సోములదొడ్డి, కామారుపల్లి పంచాయతీల్లో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి స్థలాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆయా వీఆర్‌ఓలను ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో డెప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్‌ఐ సందీప్‌కృష్ణ పాల్గొన్నారు.

నేడు పుస్తక పరిచయ సభ

అనంతపురం కల్చరల్: ప్రముఖ కవి, విజయవాడ అడిషనల్ ఎస్పీ లోసారి సుధాకర్ రచించిన కవితా సంపుటి 'ఆయుధం లాంటి మనిషి' పుస్తక పరిచయ సభ ఆదివారం సాయంత్రం 5 గంటలకు స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ప్రగతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ ముఖ్య అతిథులుగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కిస్తారని పేర్కొన్నారు. రచయితలు, కవులు ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నేడు సేవ్ ఆర్డీటీ

అనంతపురం కల్చరల్: జిల్లా బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఆర్డీటీని కాపాడుకునేందుకు జిల్లా సాహితీవేత్తలు, కళాకారులు తరలిరావాలని డాక్టర్ వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతినారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జిల్లా రచయితలు, కవులు, కళాకారులు స్థానిక టవర్‌క్లాక్ వద్ద సేవ్ ఆర్డీటీ పేరుతో మానవహారం నిర్వహిస్తున్నట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలని కోరుతూ సాగే మానవహారానికి సాహితీ అభిమానులందరూ విచ్చేసి ఆర్డీటీకి సంఘీభావం తెలపాలని కోరారు.

కిక్కు తగ్గేదేలే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మందుబాబులు విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్నారు. కూలి, ఇతరత్రా పనులు చేసి సంపాదించిన మొత్తం మద్యానికే ఖర్చు పెడుతున్నారు. కుటుంబాలను గాలికొదేలిస్తున్నారు. పూటుగా మద్యం తాగి రోడ్లపై పడిపోతున్నారు. శనివారం అనంతపురం నగరం నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహం వద్ద ఓ వ్యక్తి మద్యం సేవించి ఇలా రోడ్డు పక్కనే పడిపోయాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



విద్యార్థులకు వ్యాధి నిరోధక టీకాలు



విద్యార్థులకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు శనివారం టి.డి (టెటనస్ డిఫ్తీరియా) నివారణకు వ్యాక్సిన్ వేశారు. పాఠశాలలో చదువుతున్న 6, 10వ తరగతి విద్యార్థులకు మాత్రమే వ్యాక్సిన్ వేస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలియజేశారు. ఈ ఇంజక్షన్ వేస్తే పిల్లలకు ఏదైనా గాయం అయినా త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడి ఎంపిక



రామనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, చాంద్‌బాషా

అనంతపురం ఎడ్యుకేషన్: ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎ.రామనారాయణను ఎన్నుకున్నారు. ఈ మేరకు శనివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై చర్చించారు. అనంతరం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎ.రామనారాయణను సిఫార్సు చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. జిల్లా కమిటీ సిఫార్సుతో రాష్ట్ర కమిటీ ఆమోదముద్ర వేస్తుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వీరేష్, ఎస్.చాంద్‌బాషా తెలిపారు. ఈ సందర్భంగా రామనారాయణకు జిల్లా కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

విద్యుత్ భారాలపై 5న నిరసనలు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

అనంతపురం అర్బన్: వినియోగదారులపై విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ జూలై ఐదో తేదీన జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ తెలిపారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అదే విధంగా స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత మాటమార్చి ఏడాదిలో నాలుగుసార్లు విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపారన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో ఏకంగా రూ.15,485 కోట్ల భారం వినియోగదారులపై మోపారన్నారు. ఇక స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకూ సిద్ధమయ్యారన్నారు. వీటన్నింటినీ వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. అదే విధంగా ఆగస్టు 9, 10 తేదీల్లో నిర్వహించనున్న జిల్లా మహాసభల్లో ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై విస్తృతంగా చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.నారాయణస్వామి, కార్యదర్శివర్గ సభ్యులు రాజారెడ్డి, సంజీవప్ప, గోవిందు పాల్గొన్నారు.

రైళ్లపై నిఘా పెంచాలి

గుంతకల్లు: రైళ్లపై నిఘా పెంచాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆదేశించారు. శనివారం స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో ఎస్‌సీఆర్ డీఆర్‌ఎంలతో సమావేశం ఏర్పాటు చేశారు. గుంతకల్లు డివిజన్ పరిధిలో వంతెన వివరాలతో పాటు చెరువులు, నదులు, డ్యామ్‌లకు సమీపంలో ఉన్న రైలు మార్గాలపై రైల్వే జీఎం ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ట్రాక్‌లు, వంతెనలు, భారీ వర్షాలు కురిసే మార్గాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. సిగ్నలింగ్ వ్యవస్థలో ఎలాంటి సాంకేతిక సమస్య తలెత్తకుండా జాగ్రత్తలను పాటించి రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడలన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. లోటుపాట్లు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు.